సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

ఆరిలోవ: ఐఐఎం కళాశాల విద్యార్థులు శనివారం ఎంవీపీ రైతు బజార్‌ను సందర్శించారు. కూరగాయలు విక్రయించే రైతులు, డ్వాక్రా గ్రూపు మహిళలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారికి క్లాత్ సంచులు పంపిణీ చేశారు. రైతుబజార్ సిబ్బందికి మొక్కలు అందజేశారు.

మద్యం మత్తులో ర్యాష్‌డ్రైవింగ్

- పలువురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

ఎంవీపీకాలనీ : మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఉషోదయ కూడలి ప్రాంతానికి చెందిన విఘ్నేష్ మద్యం సేవించి బీచ్‌రోడ్డులోని డ్రైవ్ ఇన్ లోపలి నుంచి బయటికి వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో వారికి గాయాలయ్యాయి. దీంతో వారు అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా విఘ్నేష్ ర్యాష్‌గా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో మరో మూడు వాహనాలను ఢీకొట్టాడు. దీంతో వారంతా అతన్ని వెంబడించి సిరిపురం కూడలి వద్ద పట్టుకున్నారు. అనంతరం త్రీటౌన్ పోలీసులకు అప్పగించడంతో వారు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా డ్రైవర్ మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. వాహనాలను ఢీకొన్న ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలోనిది కావడంతో వారు విఘ్నేష్‌ను ఎంవీపీ పోలీసులకు అప్పగించారు. విఘ్నేష్‌పై ర్యాష్ అండ్ నెగ్లిజెన్సీ సెక్షన్ 299 కింద కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గురైన వారికి స్వల్పంగా యాలే కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఏయూ సమాచారమ్

పుస్తక రూపంలో మహానేత వైఎస్సార్ జీవిత చరిత్ర



వీసీ ప్రసాదరెడ్డికి పుస్తక రచన వివరాలు తెలియజేస్తున్న రామమోహనరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకు వస్తున్నట్లు అనంతపురానికి చెందిన టి.రామమోహనరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఏయూను సందర్శించి, తాను రచిస్తున్న పుస్తక విశేషాలను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డికి వివరించారు. మహానేత మరణానంతరం ఆయన విగ్రహాన్ని ఏయూలో నెలకొల్పిన విషయం తెలుసుకుని తాను ఏయూకు వచ్చానన్నారు. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాలను, సంఘటనలను ఈ పుస్తకంలో తాను పొందుపరచనున్నట్లు తెలిపారు. త్వరలో పుస్తక ముద్రణ పూర్తి చేసి ఏయూకు అందిస్తానన్నారు.

మహిళలను గౌరవించాలి

ఏయూక్యాంపస్ : సమాజంలో ప్రతి మహిళను గౌరవించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో విద్యార్థులకు ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 అంశంపై నిర్వ హించిన సదస్సులో పాల్గొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదుర్కోవలసిన పర్యవసానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నాల్గవ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.వి.ఎల్ హిమబిందు, ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్య పద్మావతి, డాక్టర్ కె.ప్రభాత్, బి.హరి వెంకట రమణ,మురళీధర్, లక్ష్మి రాంబాబు, ఆచార్య సీతా మాణిక్యం, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచన

ఏయూక్యాంపస్ : డిగ్రీ విద్యార్థులకు ఉపయుక్తంగా రచించిన సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ బి.సతీష్‌కుమార్ ఈ పుస్తకాన్ని రచించారు. డిగ్రీ ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధంగా దీనిని రచించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను వీసీ అభినందించారు.

మాధవీలతకు డాక్టరేట్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బి.మాధవీలతకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు కె.సమత, ఆచార్య వి.వీరయ్య సంయుక్త పరిశోధనలో నానో ఫెర్రైట్స్‌లో సింథసిస్, స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్, మేగ్నటిక్ ధర్మాలపై జరిపిన అధ్యయనానికి ఈ డాక్టరేట్ లభించింది. వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు.

చెత్త తొలగిస్తున్నారు

సాక్షి ఎఫెక్ట్..



గెడ్డ అంచున చెత్తను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: గెడ్డ అంచున వదిలేసిన చెత్త దిబ్బలను జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. గెడ్డల్లో పూడికలు తీసి, వదిలేయడంతో దుర్గంధంతో స్థానికులు పడుతున్న అవస్థలపై 'పూడిక తీసి వదిలేశారు' శీర్షికతో సాక్షిలో ఈ నెల 2న ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. జేసీబీతో ఇక్కడ గెడ్డ అంచున నిల్వ చేసిన చెత్త దిబ్బలను శనివారం తొలగించి శుభ్రం చేశారు. వివరాలివి.. ఇటీవల ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల గెడ్డలు శుభ్రం చేయించారు. గెడ్డల్లో పిచ్చి మొక్కలు, పూడిక తొలగించి వర్షాల ద్వారా వచ్చే వరద నీరు కిందికి పోవడానికి వీలుగా సిద్ధం చేశారు. ఇందులో భాగంగా స్థానిక శ్రీకాంత్‌నగర్ వద్ద గెడ్డలో తొలగించిన పూడికను సిబ్బంది అంచుల్లో దిబ్బలుగా వేసి వదిలేశారు. సుమారు కిలోమీటరు పొడవునా చెత్త దిబ్బలు రెండు వారాలకు పైగా పేరుకుపోయాయి. అసంపూర్తి పనులతో ప్రజలు పడుతున్న అవస్థలపై ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చెత్త తొలగింపునకు ఆదేశించారు. దీంతో సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. సుమారు కిలోమీటరుకు పైగా గెడ్డ అంచున చెత్త దిబ్బలు ఉండటంతో, వీటిని తొలగించడానికి రెండు రోజులు పడుతుందని జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అణ్వస్త్ర రహిత ప్రపంచంపై అవగాహన



మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

ఎంవీపీకాలనీ : అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై శనివారం కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలవికాస్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో శనివారం ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబు దాడులను పురస్కరించుకుని ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన సమావేశంలో లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆచార్య దుర్గాప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచంలో అణ్వాయుధాలను పూర్తిస్థాయిలో నివారించాల్సిన అవసరముందన్నారు. ఈ దిశగా అన్ని దేశాలు కృషి చేయాలన్నారు. అణ్వాయుధాల ద్వారా జరిగే నష్టాన్ని విద్యార్థులకు వివరించారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



కృష్ణా జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్లు భాగస్వాములు కావాలని డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి పిలుపునిచ్చారు. కళాశాలలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి.సన్యాసిరావు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతను ఎన్‌సీసీ క్యాడెట్లు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో 13(ఎ) బెటాలియన్‌కు చెందిన హవల్దార్ మదన్‌బండారీ, నాయక్ రోహన్‌లాల్, అధ్యాపకులు కళావతి, పద్మావతి, హేమంత్ పాల్గొన్నారు.

7 నుంచి శ్రీవారి శ్రావణ సంగీతోత్సవాలు

ఎంవీపీకాలనీ : ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శ్రావణ సంగీతోత్సవాలు జరగనున్నాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవ కమిటీ శనివారం ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

సృజనాత్మకతను ప్రోత్సహించాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మేనేజర్ సుధ

ఏయూక్యాంపస్: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈస్ట్‌పాయింట్ కాలనీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బెహరా సుధ అన్నారు. గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో శనివారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, బ్యాంకు ఉప మేనేజర్ సంతోషి, రంజిత్, రవిశంకర్‌రెడ్డి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎం.శివశంకరరావు అనే దాత లక్ష 116 రూపాయిలు, అలాగే నక్కవానిపాలేనికి చెందిన కేవీపీ రాఘవాచార్యులు రూ. లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో త్రినాథరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

సబ్సిడీ టమాటాకు డిమాండ్



ఎంవీపీ రైతుబజారులో టమాటాల కోసం క్యూ

ఆరిలోవ: సబ్సిడీ టమాటాల కోసం ఎంవీపీ రైతు బజార్‌లో శనివారం వినియోగదారులు బారులు తీరారు. సుమారు 4 రోజులుగా సబ్సిడీ టమాటాల సప్లై లేకపోవడంతో విక్రయాలకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో శనివారం టమాటాలు రావడంతో నాలుగు కౌంటర్లలో కిలో రూ.50కి విక్రయించారు. బయటి మార్కెట్‌లో కిలో రూ.150 నుంచి 180 వరకు విక్రయిస్తుండటంతో, టమాటా కౌంటర్ల వద్ద వినియోగదారులు బారులు తీరారు. కౌంటర్ల వద్ద తోపులాట జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించి, మధ్యాహ్నం వరకు విక్రయాలు చేపట్టారు. రైతుబజారుకు సరఫరా చేసిన 2.8 మెట్రిక్ టన్నుల టమాటా విక్రయించినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.